సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



హత్య కేసులో అరెస్టు

తాడేపల్లిగూడెంలో బొబ్బిలి దేవి హత్య కేసులో దరబాల లోవరాజును అరెస్టు చేశారు. ఈ కేసు పరిష్కారం కోసం పోలీసులు రెండు బృందాలను ఏర్పాటు చేశారు.

8లో



ఆర్టీసీ బస్సు డ్రైవరు దుర్మరణం

అనకాపల్లి జిల్లా కశింకోట శివారులో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో నరసాపురానికి చెందిన బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు.

8లో

మరువ'లేఖ'



నేడు ఉత్తరం రాసేవారే కరువయ్యారు. మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరం స్మార్ట్‌ఫోన్లు, ఈ-మెయిల్స్ దెబ్బకు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

8లో

న్యూస్‌రీల్

శ్రీవారి ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



దాత కాశీ విశ్వేశ్వరరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు నలుగురు భక్తులు వేర్వేరుగా ఆదివారం రూ.5,12,232లు విరాళంగా అందజేశారు. అందులో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం అయ్యవారి పోలవరానికి చెందిన దోరేటి కాశీవిశ్వేశ్వరరావు రూ. 1,01,116, గుడివాడకు చెందిన జవ్వాది ప్రభాకరరావు రూ.2 లక్షలు, తెలంగాణా రాష్ట్రంలోని బంజరకు చెందిన మిట్టపల్లి బాలాజీ రూ. 1,00,116, హైదరాబాద్‌కు చెందిన డి.దుర్గ రూ. 1,11,000 ఆలయ కార్యాలయంలో జమ చేశారు.

టెట్ పరీక్షకు 84 శాతం హాజరు



వాసవీలో టెట్ పరీక్ష కోసం వచ్చిన అభ్యర్థులు

భీమవరం : జిల్లాలోని మూడు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) పరీక్షకు 84 శాతం అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి చెప్పారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో 183 మందికి 155 మంది హాజరుకాగా, డీఎన్నార్ అటానమస్ కళాశాలలో పరీక్షకు 211 మందికి 189 మంది హాజరయ్యారు. తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 452 మందికి 366 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నాగమణి తెలిపారు.

టెట్ పరీక్షకు 458 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్–2024 పరీక్షలు నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన తొలి విడత పరీక్షలకు 256 మందికి 204 మంది హాజరుకాగా 52 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ప్రారంభమైన రెండో విడత పరీక్షలకు 286 మందికి 254 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు.

రేపు అమ్మవారికి 1.5 టన్నుల సారె



మండలపర్రులో భక్తులు తయారు చేసిన స్వీట్లు

నిడమర్రు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలపర్రులోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో మంగళవారం దుర్గామాతకు రూ.42 లక్షలతో సమకూర్చిన స్వర్ణకిరీటాన్ని అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా అదే రోజు 1.5 టన్నుల బరువున్న 11 రకాల స్వీట్లను సారెగా సమర్పించనున్నారు. ఈ మేరకు ఆది, సోమవారాల్లో భక్తులు స్వయంగా తయారు చేశారు.

విద్యార్థి సంఘం నేతలపై కేసు

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్ఆర్ పేటలోని ఒక ప్రైవేటు కళాశాలలో సర్టిఫికెట్ల కోసం యాజమాన్యం వేధింపులకు గురిచేయటంతో విద్యార్థి కాలేజీ ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాలేజీ వద్దకు వెళ్ళిన విద్యార్థి సంఘాల నాయకులు యాజమాన్యాన్ని నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘర్షణలో అక్కడి ఫర్నీచర్‌ను విసిరివేశారు. ఈ సంఘటనపై కళాశాల కంప్యూటర్ ఆపరేటర్ ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగవెంకట సన్యాసిరావు, విద్యార్థి సంఘం నాయకులు ఎం.క్రాంతికుమార్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌వీ శివరావుపై కేసు నమోదు చేశారు. సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధింపులకు గురిచేసిన కాలేజీ కాలేజీ యాజమాన్యంపై మాత్రం ఏ విధమైన చర్యలు తీసుకోకపోవటంపై విద్యార్థి సంఘాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్.. ఎటు?

- భీమవరం దాటించేందుకు ఎమ్మెల్యే అంజిబాబు ఆలోచన
- మార్కెట్ యార్డులో నిర్మాణానికి గత ప్రభుత్వం జీవో
- కుట్రతో మార్చేందుకు యత్నిస్తున్నారంటూ ఆరోపణలు



భీమవరంలోని శ్రీచైతన్య కళాశాల భవనంలోని కలెక్టరేట్



ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కోసం ఎంపిక చేసిన మార్కెట్ యార్డు స్థలం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేయాలనుకున్న కలెక్టరేట్ భవనం ఇప్పుడు పట్టణ సరిహద్దులు దాటి వెళ్తుందన్న వార్తపై భీమవరం వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఏర్పాటు సమయంలో కలెక్టరేట్‌ను తాత్కాలికంగా భీమవరం శ్రీచైతన్య కళాశాలలో ఏర్పాటు చేశారు. దాంతో జిల్లాలోని నలుమూల ప్రజలు సులభంగా కలెక్టరేట్‌కు చేరుకుని అవసరమైన పనులు పూర్తి చేసుకుంటున్నారు. పాలన కూడా సులభతరమైంది. ప్రభుత్వం మారిన వెంటనే కలెక్టరేట్‌ను భీమవరం నుంచి దూరం చేయాలని కుట్ర ప్రారంభమైంది. మార్కెట్ యార్డులో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం జీవో జారీ చేసి భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్న క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

కూటమి కుట్రలు

భీమవరం ఎమ్మెల్యేగా వచ్చిన పులపర్తి రామాంజనేయులకు మార్కెట్ యార్డులో కలెక్టరేట్ ఏర్పాటు చేయడం ఇష్టం లేకే భీమవరంలో కలెక్టరేట్ లేకుండా చేయాలని కుట్రకు తెరదీశారని అంటున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయించి.. 60 ఎకరాల భూసేకరణ చేసి అక్కడ కలెక్టరేట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం మొదలు పెట్టి జీవో రద్దుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టరేట్‌ను పట్టణం దాటించాలనే ప్రయత్నంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. గతంలో ఒక ప్రముఖ వ్యక్తి కలెక్టరేట్‌ను ఉండి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తే ఉచితంగా భూమి ఇస్తానని హామీ ఇచ్చారు. అతనితో లాలూచి పడి 60 ఎకరాల సేకరణ పేరిట కలెక్టరేట్‌ను భీమవరం నియోజికవర్గంలో లేకుండా చేసి ఉండిలో ఏర్పాటు చేసేలా కుట్రలు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కలెక్టరేట్ స్థానికంగా ఉండాలని ప్రజలు పోరాటం చేసే పరిస్థితిని అంజిబాబు తీసుకువస్తారా? లేదా తన ఆలోచన మార్చుకుని కలెక్టరేట్ మార్కెట్ యార్డ్‌లోనే ఏర్పాటుకు అంగీకరిస్తారో చూడాలి

మార్కెట్ యార్డు సరైన ప్రాంతం

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటుకు భీమవరం మార్కెట్ యార్డు అన్ని విధాలా అనువైంది. గత ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులు మార్కెట్ యార్డ్‌ను పరిశీలించి కలెక్టరేట్‌కు అనువైందిగా నిర్ధారించారు. అనంతరం జీవో జారీ చేశారు. మార్కెట్ యార్డ్‌కు తూర్పు వైపు నుంచి పాలకొల్లు, ఆచంట, నర్సాపురం, పడమర వైపు నుంచి ఉండి, ఉత్తరం నుంచి తణుకు, తాడేపల్లిగూడెం నియోజవర్గాలకు రోడ్లు ఉన్నాయి. భీమవరం పట్టణంలోకి వెళ్లే పని లేకుండా ప్రజలు సులభంగా మార్కెట్ యార్డ్‌లోని కలెక్టరేట్‌కు రావచ్చు. ధర్నాలు, బంద్‌లు, నిరసన తెలిపే వారు కలెక్టరేట్‌కు వచ్చిన కూడా ట్రాఫిక్ ఇబ్బందులుండవు.

కలెక్టరేట్ భీమవరంలోనే ఉండాలి



కలెక్టరేట్ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. కలెక్టరేట్ భీమవరం పట్టణం దాటినా లేదా మారో నియోజవర్గంలో ఏర్పాటు చేసిన భీమవరం ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడతారు.

– మారోజు గణేష్, భీమవరం

అన్ని నియోజకవర్గాలకూ అనుకూలం



భీమవరం మార్కెట్ యార్డ్‌లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఏర్పాటు చేస్తే భీమవరంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. గ్రంధి శ్రీనివాస్ ముందు చూపుతో జిల్లా కేంద్రాన్ని సాధించడంతో పాటు మార్కెట్ యార్డ్‌లో కలెక్టరేట్ ఏర్పాటుకు కృషి చేశారు.

– వీరవల్లి శ్రీనివాస్, తోకలపూడి

మంత్రి పదవిని త్యాగం చేసిన గ్రంధి

భీమవరం జిల్లా కేంద్రం చేయడం కోసం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మంత్రి పదవిని త్యాగం చేశారు. ఇదే విషయాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో భీమవరం ప్రజలకు చెప్పారు. భీమవరం జిల్లా కేంద్రం, కలెక్టరేట్‌ను స్థానికంగా ఏర్పాటు చేసేందుకు గ్రంధి శ్రీనివాస్ కృషి చేశారు. మార్కెట్‌యార్డులో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు సైతం కృషి చేశారు.


ఉచిత ఇసుక సరఫరా చేయాలి



ఉచిత ఇసుక కోసం ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నరసాపురం: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని నరసాపురం సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత ఇసుక విధానం అమలు కోరుతూ భవన నిర్మాణ కార్మికులతో స్థానిక పంజా సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ఉచిత ఇసుక అని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 100 రోజులు అవుతున్నా హామీ పట్టించుకోవడంలేదన్నారు. ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్ అంటూ డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఇసుక లేక భవన నిర్మాణాలు నిలిచిపోయాయని వాపోయారు. ర్యాంపుల వద్ద, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక నేరుగా లభ్యమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పోతినీడి రామకృష్ణ, అడబాల ప్రకాష్, సీపీఎం నాయకులు పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంతం, పున్నాని అప్పలనాయుడు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా.. లలితా త్రిపుర సుందరిగా



ద్వారకాతిరుమలలో శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో కుంకుళ్లమ్మ



అన్నపూర్ణా దేవి అలంకరణలో మావుళ్లమ్మ అమ్మవారు

నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ ఆదివారం అందరి ఆకలి తీర్చే అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక కుంకుమ పూజలు, అలంకరణ పూజలు నిర్వహించారు. ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శన భాగ్యాన్ని కల్పించారు. లక్ష్మీ, సరస్వతులు వింజామరలు వీస్తున్నట్లున్న లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలోని అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

– భీమవరం(ప్రకాశంచౌక్), ద్వారకాతిరుమల

ఇస్రో పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టర్ నాగరాణి



భీమవరంలో జరిగిన అంతరిక్ష వారోత్సవాల్లో రాకెట్ నమూనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: అంతరిక్ష కార్యక్రమం కేవలం రాకెట్లు, ఉపగ్రహాల గురించి మాత్రమే కాదని వాస్తవ ప్రపంచ సమస్యలు పరిష్కరించడం ద్వారా భవిష్యత్ తరాలు స్థిరమైన, సురక్షితమైన ప్రపంచాన్ని వారసత్వంగా పొందేలా చేయడమేని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం భీమవరం బీవీ రాజు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను 'స్పేస్ అండ్ క్లైమేట్ చేంజ్' థీమ్‌తో నిర్వహిస్తున్నామని అంతరిక్ష సాంకేతికతలు, విశ్వం గురించి మన అవగాహన విస్తరింప చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇస్రో సాధించిన అత్యద్భుతమైన అంతరిక్ష పరిశోధన ఫలితాల గురించి అవగాహన పెంచుకొని, విద్యార్థులు, యువత అంతరిక్ష సాంకేతికతపై మక్కువ చూపాలన్నారు. సముద్ర మట్టాలు పెరగడం, హిమానీ నదాలు కరిగిపోవడం వంటి వాతావరణ మార్పుల ప్రభావాలను అధ్యయనం చేయడంలో ఇస్రో డేటా కీలకమన్నారు. శ్రీహరికోట షార్ సెంటర్ వీఎఎల్ఎఫ్ డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురాం మాట్లాడుతూ ఇస్రో సాధించిన విజయాల పట్ల మనం గర్వించాలని అంతరిక్ష సాంకేతికత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి కలిసి పని చేద్దామన్నారు. అంతరిక్షానికి అవధి లేదని, అపారమైన సంపద అంతరిక్షంలో దాగి ఉందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా స్పేస్ ఎగ్జిబిషన్ ప్రారంభించగా ఇప్పటివరకు ఇస్రో చేపట్టిన ప్రయోగాల నమూనాలను కలెక్టర్ తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో షార్ ఎస్‌డీఎస్‌సీ జనరల్ మేనేజర్ పి.ఏడుకొండలు, విష్ణు స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.బిందు, కళాశాల జనరల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జె.ప్రసాదరాజు, స్టూడెంట్స్ అఫైర్స్ అండ్ అడ్మిన్ డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు, ఏజీఎం రమేష్‌రాజు, బీవీ రాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, శ్రీహరికోట ఇస్రో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

దసరా సంబరాల్లో మరో మైసూరు

రెండు వందల ఏళ్లుగా నూజివీడులో ఉత్సవాలు



నూజివీడులోని గుర్రంగేటు



విద్యుద్దీపాల అలంకరణలో కోట మహిషాసురమర్దని ఆలయం



ఆలయం లోపల విద్యుత్ దీపాల ధగధగలు

నూజివీడు: దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూరుగా ప్రఖ్యాతిగాంచిన నూజివీడులో సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి కృష్ణా నుంచే కాకుండా ఏలూరు, పశ్చిమ గోదావరి, తెలంగాణ నుంచి వేలాది మంది తరలివస్తారు.

పట్టణ నడిబొడ్డున జమిందారులు ప్రతిష్ఠించిన శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయం దసరా ఉత్సవాలకు కేంద్రంగా కొనసాగుతోంది. మైసూరు తరహాలో ఇక్కడ దసరా ఉత్సవాలు నిర్వహిస్తారని పూర్వకాలం నుంచి ప్రతీతి. దసరా ఉత్సవాలు నిర్వహించే పదిరోజులూ పట్టణంలో జమిందారుల పాలనకు ప్రతీకగా ఉన్న కుక్కలగేటు, గుర్రంగేటులు విద్యుత్ దీపాలతో ధగధగలాడుతుంటాయి. నూజివీడు పట్టణం, మండలం, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, చాట్రాయి, మైలవరం, ఏ కొండూరు, తిరువూరు, లింగపాలెం, గన్నవరం తదితర మండలాల నుంచి నూజివీడులో నిర్వహించే దసరా ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తారు. ఇక్కడ కొలువై ఉన్న శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారు శక్తివంతమైన దేవతని, కొరుకున్న కోర్కెలను తీర్చే కల్పవల్లి అని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతి ఏటా దసరా ఉత్సవాల సమయంలో రాష్ట్రంలోని దూర ప్రాంతాల నుంచి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం వంటి నగరాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులను సైతం తీర్చుకుంటారు.

రెండు వందల ఏళ్ల చరిత్ర

రెండు వందల ఏళ్ల క్రితం ఉయ్యూరు రాజా నూజివీడులో దసరా ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గుర్రాల గేటు వద్ద ఉన్న ఆయుధాగారంలోని ఆయుధాలకు ఎస్టేట్‌లోని జమ్మిచెట్టు వద్ద పూజ చేసి దసరా ఉత్సవాన్ని ప్రారంభించే ఆనవాయితీ నేటికీ కొనసాగుతోంది. ఉయ్యూరు రాజా హయాంలో పద్నాలుగు ఎస్టేట్లకు చెందిన ఏనుగుల అంబారీ, ఒంటెలు, గుర్రపు స్వారీలతో పెద్ద ఊరేగింపు జరిగేది. కోలాటాలు, కత్తి సాము, గారడీలు, మేజువాణిలతో సంబరాలు సాగేవి.రాజా వెంకటాద్రి అప్పారావు మైసూరులో దసరా ఉత్సవాలను తిలకించి అక్కడి బుట్టబొమ్మలను చూసి ముగ్ధుడయ్యారు. ఆ తరహాలోనే బుట్టబొమ్మలను తయారు చేయించి నూజివీడులో జరిగే ఉత్సవాల్లో ప్రదర్శింపజేసేవారు.

ప్రత్యేక కార్యక్రమాలు

పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యనారాయణ ఉత్సవాలు పర్యవేక్షిస్తున్నారు.

ఉత్సవాలకు నిధుల కొరత

దసరా ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నిధులు రాకపోవడం, కేవలం విరాళాలతోనే ఉత్సవాలు నిర్వహించాల్సి రావడంతో ఏటా నిర్వహణకు నిధుల కొరత ఎదురవుతుంది. దసరాకు ముందే వినాయకచవితి రావడం, ప్రజలందరూ గణేష్ నవరాత్రుల నిర్వహణకు చందాలు ఇస్తుండటంతో వెంటనే వచ్చే దసరాకు చందాలు అంతగా ఇవ్వడం లేదు.

2034 నాటికి కాపు నేతే సీఎం !

ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు



భీమవరంలో కోపా ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు తదితరులు

భీమవరం : రానున్న రోజుల్లో రాష్ట్రానికి కాపు నాయకుడు ముఖ్యమంత్రి అవుతారని, 2034 నాటికి రాష్ట్రాన్ని కాపులు పాలిస్తారని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. భీమవరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కాపు సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మనం సహకరించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని, పట్టుదల, కృషి, ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. కాపులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విశ్వబలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పు కాపు సంఘాల సమాఖ్య సహకారంతో 70 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కోపా అధ్యక్షుడు యర్రంశెట్టి హరినాథ్ రావు, కార్యదర్శి అరేటీ సత్యనారయణ, జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్, యిర్రింకి సూర్యారావు, పీవీ రావు, కృష్ణారావు పాల్గొన్నారు.

అనధికారిక ఇసుక అమ్మకాలు ఉపేక్షించం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: అనధికారిక ఇసుక అమ్మకాలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. ఆదివారం భీమవరం కలెక్టరేట్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో అవసరమైన లబ్ధిదారులు ఇసుక పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇసుక దరఖాస్తుకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే 93914 45753, 86882 91997, 81869 39223, 95501 75144 నెంబర్లకు ఫోన్ చేసి టెక్నికల్ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఇసుక పూర్తిగా ఉచితమని, నిర్వహణ చార్జీలు, రవాణా చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరలకు అనుగుణంగా వినియోగదారులకు సక్రమంగా అందేలా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు, ఏఎస్పీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 రగ్బీ టీం ఎంపిక

పెదవేగి: అండర్–19 జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున టీంను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.జయరాజు అన్నారు. ఏపీఎస్‌జీఎఫ్ రగ్బీ అండర్–19 బాలుర రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల పోటీలు ఈ నెల 5 నుంచి 6 వరకు పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో 12 జిల్లాల క్రీడాకారులు పాల్గొనగా, మొదటిస్థానంలో కర్నూలు, రెండవ స్థానం శ్రీకాకుళం, మూడవ స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో కడప జిల్లాలు నిలిచాయి.

క్లుప్తంగా

చెస్ క్రీడాకారులకు బహుమతుల అందజేత



చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీల ఆధ్వర్యంలో అండర్ 15 బాలుర, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలు భీమవరం టూటౌన్‌లోని అనసూయ చెస్‌అకాడమీ సెంటర్ నందు ఆదివారం నిర్వహించారు. విజేతలు యశ్వత వర్మ (భీమవరం), పి.జోగేందర్ (తాడేపల్లిగూడెం), పూజిత్ శరణ్ (భీమవరం), వెంకట కార్తికేయ (తాడేపల్లిగూడెం) గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు మెంటే పార్థసారథి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, మలిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

క్వార్టర్ ఫైనల్‌లో వెనుదిరిగిన ఏలూరు, నూజివీడు జట్లు



ఉత్కంఠ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఏలూరు రూరల్: ఏలూరులో మూడురోజులుగా జరుగుతున్న మోహన్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. సాయంత్రం 6 గంటలకు ఫ్లడ్‌లైట్స్ వెలుగుల్లో జరిగిన ఫైనల్ పోటీల్లో చిత్తూరు, రామచంద్రపురం జట్లు తలపడ్డాయి. మొదట, రెండు క్వార్టర్స్‌లో రెండు జట్లు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. మూడో క్వార్టర్‌లో చిత్తూరు జట్టు క్రీడాకారులు వరుసగా పాయింట్లు సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించారు. ఆఖరికి 61-42 స్కోర్‌తో చిత్తూరు జట్టు విజేతగా నిలిచింది. దీనికి ముందు మూడోస్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు వైజాగ్ టీమ్‌ను 67-63 స్కోర్‌తో ఓడించింది. ఉదయం జరిగిన క్వార్టర్‌ఫైనల్‌లో స్థానిక జట్లు ఏలూరు జట్టు చిత్తూరు చేతిలో, నూజివీడు జట్టు గుంటూరు జట్టు చేతిలో ఓటమి పాలయ్యాయి. బహుమతి ప్రదానోత్సవంలో వెల్‌నెస్ కోచ్ వీజీఎంవీఆర్ కృష్ణారావు, ఏలూరు నగరం మాజీ కార్పొరేటర్ బి బాలాజీ, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్, కోశాధికారి కె మురళీకృష్ణ, గుంటూరు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు అంజితో పాటు జేమ్స్‌బాబు, పోటీల ఆర్గనైజర్ ఆలీష, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మరువ లేఖ


- మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఉత్తరం
- ఒకప్పుడు తంతి తపాలా ద్వారానే సమాచారం
- నేడు వాట్సాప్ మెసేజ్‌లతో సరిపెట్టేస్తున్న జనం
- నేటినుంచి తపాలా వారోత్సవాలు ప్రారంభం

ఏలూరు (టూటౌన్): తోకలేని పిట్ట తొంభై ఆమడల దూరం పోయింది. అది ఏంటీ అనే సామెత అడిగిన వెంటనే ఉత్తరం అని సమాధానం వచ్చేది. అయితే ఇప్పుడు ఆమాట చెప్పుకునేందుకే తప్ప నేడు ఉత్తరం రాసేవారే కరువయ్యారు. పోస్టు అని ఇంటి ముంగిట పోస్టుమేన్ కేక వేయగానే ఉత్తరం అందుకునేందుకు ఉరుకున వచ్చేవారు. తన బంధుమిత్రులు అందించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఉత్సుకతతో ఉత్తరాల కోసం ఎదురు చూసేవారు. మంచి వార్తను మోసుకొచ్చిన జాబులను భద్రంగా దాచుకునేవారు. ఆ రోజులు ఓ మధుర జ్ఞాపకాల్లా మిగిలిపోయాయి. నేటి సమాజంలో పిల్లలకు పోస్టుల్లో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తిచెందేవారమని పెద్దలు చెబితే ఇంకా లేఖలు ఏంటి నేరుగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటున్నాం కదా అని అంటున్నారు. అయితే ముఖాముఖిగా వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నా సంబోధనలో ఎన్నో మార్పులు ఉంటాయి. అయితే ఉత్తరంలో పలకరింపులు సంప్రదాయబద్ధంగా ఉంటూ మనసును ఆకట్టుకుంటాయి.



పోస్ట్ బాక్స్

పెద్దలైతే మహారాజశ్రీ, చిన్నవారైతే చిరంజీవి, మహిళలను లక్ష్మీ సమానురాలైన, వితంతువులైతే గంగా భాగీరథీ సమానులైన అని సంబోధించేవారు. అలాగే ఉత్తరం ముగింపులో కూడా పెద్దలకు నమస్కారంతో అని, చిన్నవారికి ఆశీస్సులతో అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరంలో రాసేప్పుడు ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. అలాగే ముఖ్యమైన



పోస్టు కార్డు

సమాచారం ఉంటే లేఖను జాగ్రత్తగా ఒక కమ్మీకి కుట్టి పెట్టి దాచేవారు.

స్మార్ట్‌ఫోన్ ప్రభావంతోనే....

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో ప్రేమలేఖ, శ్రీవారికి ప్రేమలేఖ, ఇలా ఎన్నో లేఖలపై సినిమా తీశారు. అవి ప్రేక్షకులను సైతం విశేషంగా అలరించాయి. అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్ ఫోన్‌ను గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతల వారి పూర్తి యోగ క్షేమాలు మాట్లాడే పరిస్థితి కూడా లేదు. ఒకటి రెండు మాటలు మాట్లాడిన తర్వాత టిక్ టాక్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ఇలా వేరే వ్యాపకాలకు మొగ్గుతున్నారు. క్షేమ సమాచారాలు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులతో పంచుకునేందుకు కూడా ఇష్టపడడం లేదు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చేవరకు ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి చాలా రోజులైందనే దిగులు ఉండేది. కానీ నేడు స్మార్ట్ ఫోన్‌ల రాకతో ఉత్తరాల ఊసే లేకుండా పోయింది. దీంతో యువత అరకొర సందేశాలు పంపుకుని సంతోషపడుతున్నారే కానీ పాత కాలంలో లాగ పూర్తి సమాచారం చదువుకుని తృప్తి పడలేకపోతున్నారు.

నాడు లక్షల్లో కార్డులు ప్రింట్

ఒకనాడు ఏలూరు సర్కిల్‌పరిధిలో ఏడాదికి లక్షల్లో పోస్టల్ కార్డులను ప్రింట్ చేసేవారు. ప్రస్తుతం ఆధునికత సంతరించుకోవడం, స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం అధికం కావడం వంటి కారణాలతో పోస్టు కార్డుల సంఖ్య వేలల్లోకి పడిపోయింది. గతంలో కేంద్రం పోస్టు కార్డుల ప్రింటింగ్‌కు సబ్సిడీని అందించేది. ప్రస్తుతం దాన్ని ఎత్తివేయడం మరొక కారణంగా ఉంది. ఒక్కో పోస్టుకార్డు తయారీకి రూ.3.80 ఖర్చు అవుతుండగా దాన్ని వినియోగదారులకు కేవలం 50 పైసలకే అందజేస్తున్నారు.

నేటినుంచి తపాలా వారోత్సవాలు

తపాలా వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9వ ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిచోట్లా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కనుమరుగవుతున్న ఉత్తరాలు



ఉత్తరాలు కనుమరుగవుతున్నాయి. పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూసే రోజులు లేవు. ఉత్తరాలు రాసేటప్పుడు వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని చదువుకున్నవారు గుర్తించేవారు. తెలిసిన వారు ఇలా రాయకూడదు, ఇలా రాయాలి అని చెప్పేవారు. దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండేది. నేడు రాసే పనేలేకుండా పోయింది. ఇదంతా స్మార్ట్‌ఫోన్‌ల మహిమే.

– ఎం.గురుశర్మ, అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ నార్త్ జోన్ ఇన్‌చార్జి, ఏలూరు

ఉత్తరం ఒక సాధనంలా ఉండేది



గతంలో ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చే వరకు ఎదురుచూడటం ఎంతో చక్కగా ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే గతంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల క్షేమ సమాచారాలు తెలుసుకునేందుకు ఉత్తరం ఒక సాధనంలా ఉండేది. నేడు స్మార్ట్ ఫోన్‌ల ప్రభావంతో సమాచార సాధనంగా వినియోగించే ఉత్తరం కనుమరుగైపోయింది.

ఎం.సుధశ్రీ, గృహిణి, ఏలూరు

వినియోగం ఎక్కువగా ఉండేది



గతంలో వినియోగం ఎక్కువగా ఉండడంతో ఏ సర్కిల్‌కు ఆ సర్కిల్ పరిధిలో పోస్టు కార్డులను ప్రింటింగ్ చేసి ప్రజలకు అందుబాటులో ఉంచే వాళ్లం. దీనివల్ల తపాలా శాఖపై అదనపు భారం పడేది. దీన్ని అధిగమించేందుకు కార్డులపై వ్యాపార ప్రకటనలు ప్రింట్ చేసేవారం. తద్వారా తపాలా శాఖకు భారం పడకుండా ప్రజలకు అవసరమైన పోస్టల్ కార్డులను అందుబాటులో ఉంచే వాళ్లం.

దాసరి నాగేంద్ర కుమార్, ఎస్సీ, ఎస్టీ పోస్టల్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి, ఆల్ ఇండియా అధ్యక్షుడు, ఏలూరు

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి



కె.విజయలక్ష్మి (ఫైల్)

పాలకొల్లు అర్బన్: లంకల కోడేరుకి చెందిన వలంటీర్ కొత్తపల్లి విజయలక్ష్మి (35) ఆదివారం రాత్రి శివదేవునిచిక్కాలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇరువురు మగ పిల్లలు ఉన్నారు. విజయలక్ష్మి గ్రామంలో వలంటీర్‌గా పనిచేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వలంటీర్ల భవితవ్యం ఎటూ తేలకపోవడంతో ఆమె ఉపాధి నిమిత్తం భీమవరంలో ఓ ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగిగా చేరారు. భీమవరంలో విధులు ముగించుకుని స్కూటీపై లంకలకోడేరు వస్తుండగా శివదేవునిచిక్కాల వద్ద ఎదురుగా వస్తున్న ఐసర్ వ్యాన్ ఢీకొంది. వ్యాన్ ఆమె తలపై దూసుకుపోవడంతో ఘటనా స్థలంలో ఆమె మృతి చెందింది. పాలకొల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబాన్ని వెంటాడిన రోడ్డు ప్రమాదాలు

విజయలక్ష్మి కుటుంబాన్ని గత ఎనిమిదేళ్లుగా రోడ్డు ప్రమాదాలు వెంటాడుతున్నాయి. ఎనిమిదేళ్ల క్రితం విజయలక్ష్మి మరిది రోడ్డు ప్రమాదానికి గురై రెండేళ్లు కోమాలో ఉండి మృత్యువాత పడ్డారు. అలాగే భర్త సుబ్రహ్మణ్యం ఆర్ఎంపీగా పనిచేస్తారు. ఆయన కూడా రోడ్డు ప్రమాదానికి గురై అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ప్రభుత్వం ఆయనకు దివ్యాంగుల పింఛన్ అందిస్తోంది. విజయలక్ష్మి అత్తమామలు రెండేళ్ల క్రితం కూడా ఊహించని రీతిలో మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం విజయలక్ష్మి రోడ్డు ప్రమాదంలో చనిపోయిందనే వార్త గ్రామంలో ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యులంతా అకాల మృత్యువాత పడడంతో జీర్ణించుకోలేక పోతున్నారు.

వాహనం ఢీకొని యాచకుడి మృతి

కుక్కునూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. కుక్కునూరు ఎస్సై రామక్రిష్ణ చెప్పిన వివరాలివి. మండలంలో వివిధ ప్రాంతాల్లో యాచనచేస్తూ తిరుగుతున్న వ్యక్తిని శనివారం రాత్రి వెంకటాపురం గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన అతడిని స్థానికులు 108అంబులెన్స్‌లో బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాధితుడు ఆదివారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

అప్పు ఇవ్వలేదని హత్య చేశాడు

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ భీమారావు

తాడేపల్లిగూడెం అర్బన్ : అప్పు ఇవ్వలేదని ఓ మహిళను హత్య చేసిన ఉదంతమిది. తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ వి భీమారావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాడేపల్లిగూడెం గాంధీబొమ్మసెంటర్‌లో నివాసం ఉంటున్న బొబ్బిలి దేవి 4వార్డులోని ఘంటసాల విగ్రహం సమీపంలో పాన్‌షాపు, కూరగాయల దుకాణాన్ని నిర్వహిస్తోంది. వీటితోపాటుగా వడ్డీ వ్యాపారం చేస్తోంది. ఆమె ఇంటి సమీపంలోనే నివాసం ఉండే దరబాల లోవరాజు బంటా మేస్త్రీగా పనిచేస్తుంటాడు. ఈ నేపథ్యంలో లోవరాజు గత నెల దేవి షాపు వద్దకు వెళ్లి తనకు కొంతసొమ్ము వడ్డీకి అప్పు ఇవ్వాలని అడిగాడు. అందుకు తాకట్టుగా ఏమి ఇస్తావని ఆమె అడిగింది. అప్పటికే లోవరాజు తన ఇంటి దస్తావేజులను వేరొకరికి తాకట్టుగా



హత్యకేసు వివరాలను వెల్లడించిన ఏఎస్పీ వి.భీమారావు

పెట్టి అప్పు తీసుకున్నాడు. దీంతో తన వద్ద తాకట్టు పెట్టడానికి ఏమీ లేకపోవడంతో దేవి ఇంటిలోని సొమ్మును కాజేసేందుకు వ్యూహం పన్నాడు. గత నెల 3వతేదీ రాత్రి దేవి ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంకు పక్కన దాక్కొని 11.30 గంటల సమయంలో ఆమెను పిలిచి తలుపులు తీసిన వెంటనే ఇంటిలోకి ప్రవేశించి టవల్‌తో ఆమె పీకకు చుట్టి హత్య చేశాడు. దేవి ఇంటిలో ఉన్న ఒక బంగారు ఉంగరం, రూ.1,30,000 నగదును అపహరించుకుపోయాడు. దీనిపై దేవి మూడవ కుమార్తె పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. డీఎస్పీ విశ్వనాధ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఎ సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. విచారణ సమయంలో నిందితుడు స్థానిక కొండాలమ్మ ఆలయం సమీపంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో అక్కడకు చేరుకొని ఆదివారం లోవరాజును అరెస్టు చేశారు. లోవరాజు వద్ద నుంచి రూ.1,03,000 పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు నిమిత్తం మరో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. హత్య చేసిన అనంతరం లోవరాజు వస్తున్న సమయంలో గాంధీ బొమ్మ సెంటరులో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అవడంతో హత్యకేసును త్వరితగతిన పరిష్కరించగలిగామని ఏఎస్పీ వి భీమారావు చెప్పారు. కేసు విచారణలో ప్రతిభ కనబర్చిన సిబ్బందికి ఏఎస్పీ వి భీమారావు చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పి.నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకు కన్నబిడ్డ విక్రయం

అడ్డుకున్న అధికారులు

నూజివీడు: అప్పులు తీర్చేందుకు కన్న బిడ్డను విక్రయించేందుకు ఓ తల్లి ప్రయత్నించగా పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలోని ఆర్ఆర్ పేటకు చెందిన గృహిణి తన 11 నెలల మగబిడ్డను విక్రయిస్తోందని శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో 112కి సమాచారం అందింది. దీంతో పట్టణ సీఐ సత్య శ్రీనివాస్‌తో పాటు, ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరాని వెంటనే వెళ్లి అడ్డుకున్నారు. గృహిణికి ముగ్గురు పిల్లలు కాగా వారిలో ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ఆమె కులాంతర ప్రేమ వివాహం చేసుకోగా ఆరు నెలలుగా భర్త ఇంటికి రావడం లేదు. దీంతో అప్పులు ఎక్కువగా ఉండటంతో 11 నెలల మగ బిడ్డను విక్రయిస్తానని తనకు పరిచయమున్న మహిళా లెక్చరర్‌కు తెలిపింది. దీంతో ఈ లెక్చరర్ మరొక లెక్చరర్‌కు ఈ విషయం తెలిపింది. వారు బిడ్డను ఇచ్చినందుకు గాను రూ.2 లక్షలు ఇస్తామని మాట్లాడుకొని రూ.1.40 లక్షలు చెల్లించి, మిగిలిన రూ.60 వేలు తరువాత బ్యాంకు ఖాతాలో వేస్తామని ఒప్పందం చేసుకున్నారు. డబ్బు తీసుకున్న బిడ్డ తల్లి ఇంటికి వెళ్లి డ్వాక్రా గ్రూపునకు సంబంధించి బాకీ రూ.15 వేలను కట్టేసింది. దీంతో గ్రూపు సభ్యులు ఆరా తీయగా.. ఇంటి వద్ద మూడో బిడ్డ కనిపించకపోవడంతో వారికి అనుమానమొచ్చి 112కి కాల్ చేసి చెప్పారు. దీంతో పట్టణ సీఐ కన్నతల్లి పైన, బిడ్డను కొన్నవారిపైన, మధ్యవర్తిత్వం చేసిన మహిళ పైన కేసు నమోదు చేశారు. బిడ్డను, ఆమె తల్లిని ఏలూరులోని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు శనివారం అప్పగించారు.

నూతన జీఎం డబుల్ త్రెషింగ్ మెషీన్ ఆవిష్కరణ



కష్టమర్ మీట్‌లో మాట్లాడుతున్న నిర్వాహకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో నూతన డబుల్ త్రెషింగ్ వరికోత మెషీన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అద్వీత అగ్రోస్ కంపెనీ తరుపున ఆదివారం పట్టణంలో కస్టమర్ మీట్ నిర్వహించారు. రైతులకు అధునాతన టెక్నాలజీని పరిచయం చేసిన జీఏఎం వరికోత మెషీన్ కంపెనీ అధినేత అమృత్ సాయిని శ్రీ వెంకటేశ్వర సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ పెద్ద కృష్ణంరాజు అభినందించారు. జీఏఎం మెషీన్‌తో 14 బస్తాల ట్యాంక్ ద్వారా తక్కువ టైంలో కోత కోస్తుందని, వరి గింజ వృథా కాదని, గడ్డి కూడా పశువులకు ఉపయోగపడుతుందని కంపెనీ చెప్పారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఆగిరిపల్లి: కూతురు మందలించడంతో ఓ తండ్రి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఆగిరిపల్లి గన్నవరం రోడ్డులో నివసించే ధిల్లాను ధర్మారావు (47) విజయవాడలోని కేవీఆర్ ట్రావెల్స్‌లో పనిచేస్తున్నాడు. ఇటీవల అప్పుల బాధతో మద్యానికి బానిస అయ్యాడు. తండ్రిని మద్యం మానేయమని కూతురు శనివారం మందలించింది. దీంతో మనస్తాపం చెందిన ధర్మారావు అందరూ నిద్రపోతున్న సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని మృతి చెందాడు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన సూపర్ లగ్జరీ బస్సు

- ఆర్టీసీ బస్సు డ్రైవర్ దుర్మరణం
- ఏడుగురు ప్రయాణికులకు గాయాలు
- కశింకోటలో ఘటన

కశింకోట: ఆగి ఉన్న లారీని ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. అనకాపల్లి జిల్లా కశింకోట శివారులో జాతీయ రహదారిపై ఆదివారం వేకువ జామున ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు విశాఖపట్నం వెళ్తోంది. కశింకోట శివారులోకి రాగానే, ఒక లారీ అవతలి రోడ్డుకు వెళ్లడానికి మలుపు తిరుగుతోంది. దీని ముందు ఆగి ఉన్న మరో లారీ కనిపించకపోవడంతో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. బస్సు ముందు భాగం నుజ్జు అయింది. దీంతో పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం ఎల్లపాకూరు గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ గుత్తిలి జగన్మోహనరావు (50) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బస్సులోని ఏడుగురు ప్రయాణికులు గాయపడగా, 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందిన వారు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. బస్సులోని మిగిలిన ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బస్సు డ్రైవర్ గుత్తిలి జగన్మోహనరావు(ఫైల్)



నుజ్జయిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ముందు భాగం

బీపీ బిళ్లలు అధిక మోతాదులో వేసుకుని..

ఏలూరు టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి చెందిన తెనాలి సంగీతరావు (58)కి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. పదేళ్ల క్రితం సంగీతరావుకు పక్షవాతం రాగా అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మందులను వాడుతున్నాడు. నలుగురు పిల్లలు ఇచ్చే ఆదాయంతో తల్లిదండ్రులు జీవితం నెట్టుకొస్తున్నారు. ఇటీవల వైద్యుని వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా కిడ్నీలో ఇన్ఫెక్షన్ ఉందని మందులు వాడాలని వైద్యుడు సూచించారు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సంగీతరావు తను వాడే బీపీ బిళ్లలు ఆదివారం అధిక మోతాదులో వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. హాస్పిటల్ వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేయగా ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీభత్సం సృష్టించిన కారు

పెనుమంట్ర: మార్టేరు నెగ్గిపూడి బ్యాంకు ప్రాంతంలో ఓ కారు బీభత్సం సృష్టించింది. పెనుగొండ నుంచి భీమవరం వెళుతున్న కారు నెగ్గిపూడి బ్యాంకు దగ్గర అదుపుతప్పి సుజుకి మోటారు స్టాల్ వాహనంపైకి దసుకువచ్చింది. ఈ సమయంలో స్టాల్ నిర్వాహకులు భోజనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే నిలుపుదల చేసిన ఐషర్ వాహనాన్ని ఢీకనడంతో కారు మొదట భాగం పూర్తిగా దెబ్బతింది. వాహనంలో ప్రయాణిస్తున్న ముగ్గురు మద్యం తాగిన మత్తులో డ్రైవింగ్ చేయడంతో కారు అదుపుతప్పి దూసుకువచ్చిందని సంఘటన ప్రాంతంలో ఉన్నవారు చెబుతున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వచ్చి సమాచారాన్ని ఇన్‌చార్జ్ ఎస్సై వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో కొత్త మోటారు వాహనాలు దెబ్బతిన్నాయి. మద్యం మత్తులో ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



నెగ్గిపూడి వద్ద మోటారు స్టాల్‌ను ఢీకొట్టిన కారు

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్: వివాహేతర సంబంధం కారణంగా ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలివి. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన చిన్న లోవరాజు (33) ఆటో నడుపుతూ భార్య సాయి, ఇద్దరు పిల్లలతో వీకర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం క్రితం ఒక హిజ్రాతో అతడికి పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఆ హిజ్రాతోపాటు మరి కొందరు హిజ్రాలను ఆటోలో వారికి అవసరమైన చోటు దింపుతూ తిరిగి మళ్లీ తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో ఒక హిజ్రాతో పరిచయం వివాహేతర సంబంధంగా మారడంతో భార్య బిడ్డల వద్దకు వెళ్లడం మానివేశాడు. ఇదిలా ఉండగా హిజ్రాతో మనస్పర్థలు రావడంతో స్థానిక వార్ఫ్ రోడ్డులోని హిజ్రా ఇంటిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు లోవరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్లాస్టిక్ భూతం.. ప్రాణాంతకం

- పట్టణం, గ్రామాల్లో విచ్చలవిడిగా వాడకం
- నియంత్రణలో అధికారులు విఫలం


తణుకు పాతవూరులోని పంట కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

తణుకు: ఒకప్పుడు సంతకు వెళ్లినా, సరుకులకోసం బజారుకు వెళ్లినా, చేతిలో గుడ్డ సంచి ఉండేది. అందులోనే అవసరమైన సరుకుల్ని వెంట తెచ్చుకునే వారు. ఏమైనా అవసరమైతే పొట్లాలు కట్టి మరీ ఇచ్చేవారు. పెద్ద మొత్తంలో సరుకులు కొనాలంటే గోనె సంచులు తీసుకెళ్లే వారు. ఫలితంగా పర్యావరణానికి ఎలాంటి హాని కలిగేదికాదు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. సంతకు వెళ్లినప్పుడు సంచులు తీసుకెళ్లేవారు కరువయ్యారు. బజారులో ఎక్కడ కెళ్లినా ఏ వస్తువు కొనుగోలు చేసినా ఒక ప్లాస్టిక్ సంచిని చేతిలో పెడుతున్నారు. తణుకు మున్సిపల్ పరిధిలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. ప్లాస్టిక్ వాడకంపై పలు ప్రాంతాల్లో నిషేధం ఉన్నప్పటికీ కొన్నిచోట్ల ఆచరణలో అమలు కావడంలేదు. ఇంటికి తెచ్చిన ప్లాస్టిక్ సంచులను అవసరం తీరాక కాలువలు, డ్రైనేజీల్లో పడేస్తున్నారు. దీంతో చెత్తకుప్పల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. మరోవైపు డ్రైనేజీలు, పంట కాలువలు ముందుకు పారకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డు తగులుతోంది. దీంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నా ప్రజల్లో చైతన్యం రావడంలేదు.

ఎక్కడ చూసినా ప్లాస్టిక్

పర్యావరణానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వస్తువులు మన జీవితంలో భాగమయ్యాయి. పాలిథిన్ కవర్లు, ఇతర వస్తువులు వినియోగం ప్రగతికి శాపంగా మారింది. పాలిథిన్ మట్టిలో కలవదు. భూమిలో వర్షపు నీటిని ఇంకనీయదు. ప్రజలకు, మూగజీవులకు ప్రాణాంతకంగా తయారైంది. 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ మట్టిలో పూర్తిగా కలిసిపోవాలంటే కొన్ని ఏళ్లు పడుతుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కడ చూసినా అలాంటి ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలే దర్శనమిస్తున్నాయి. రోజూ నిల్వ అవుతున్న ఘన వ్యర్థాల్లో 40 నుంచి 50 శాతం స్థానాన్ని పాలిథిన్ కవర్లు ఆక్రమిస్తున్నాయి. ప్రధానంగా వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో విందు భోజనాల పేరుతో అధికంగా వ్యర్థాలను పడేస్తున్నారు. దుకాణాల కారణంగా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో సైతం ఇప్పుడు ఇది పెద్ద సమస్యగా మారింది. దీనివల్ల పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మూగజీవుల ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతున్నాయి. కవర్లలో మిగిలిన ఆహారం, తినుబండారాలు తినేందుకు పశువులు కవర్లను మింగేస్తున్నాయి. దీంతో అవి అనారోగ్యం బారిన పడుతున్నాయి. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు పెరుగుతున్నాయి.

కనువిప్పు ఎప్పుడు?

విచ్చలవిడిగా కవర్ల వాడకం వల్ల ప్లాస్టిక్ పేరుకుపోయి, వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఎంత వర్షాలు కురిసినప్పటికీ భూగర్భ జలాలు పెరగని పరిస్థితి తలెత్తుతోంది. ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, ప్లేట్లు కాల్చేయడం వల్ల వాయు కాలుష్యం పెరిగిపోతోంది. పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా వీటి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో మాంసం, పండ్లు, కూరగాయలు, ఫ్యాన్సీ, చిల్లర దుకాణదారులు వినియోగదారులకు వీటిని అంటగడుతూనే ఉన్నారు. టీ దుకాణాల్లో మాత్రమే కాగితంతో తయారు చేసిన గ్లాసులు వాడుతున్నారు. మిగిలిన అన్ని దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో ఉంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారిపై చర్యలు చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. ఒకవేళ విక్రయించాల్సి వస్తే ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి తయారీ ఉండాలంటున్నారు. ఇకనైనా అధికార యంత్రాంగం స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రణాళికలు



తణుకు మున్సిపల్ పరిధిలోని ప్లాస్టిక్ నిషేధానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ముఖ్యంగా డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. దీన్ని అధిగమించడానికి ముందుగా డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించడానికి చర్యలు చేపట్టాం. దశల వారీగా ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

– టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, తణుకు

నరసింహానంద సరస్వతి వ్యాఖ్యలు సరికాదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఒక మతం ఇంకో మతంపై బురద జల్లడం భారత రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను ఉల్లంఘించడమేనని మైనార్టీ సెల్ నాయకుడు ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ యూపీ పూజారి యతి నరసింహానంద సరస్వతి స్వామి సనాతన ధర్మాన్ని చెబుతూ ఇస్లాం, మొహమ్మద్ ప్రవక్తపై అనేక నిందారోపణలు చేయడం సరికాదని తెలిపారు. ఎవరి మత విశ్వాసాలను వారు ఆచరించాలని, ఇతర మతాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని మతాలు కలిసి మెలిసి ఉండాలని కోరుతున్నట్లు వివరించారు.

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందాలి

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక జ్ఞానం పొందాలని యునైటెడ్ పాస్టర్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు డీఆర్‌కే మోజెస్ అన్నారు. మీనవిల్లూరు పాస్టర్ కృష్ణ చర్చిలో మూడు రోజుల ఉపవాస ఆశీర్వాద పండుగలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. మోజెస్ ప్రారంభ ప్రార్థన చేశారు. ఆధ్యాత్మికంగా తనను వెంబడించే వారికి యేసు క్రీస్తు నిత్యం తోడుంటారని వివరించారు. ఆయన ద్వారానే క్షమ, దయ, శాంత స్వభావం అలవడుతాయని తెలిపారు. చర్చి పాస్టర్ మహేష్‌పాల్, రేణులు స్తుతి ఆరాధన చేశారు. మంగళవారం రాత్రి వరకు కొనసాగే సభల్లో ప్రముఖ దైవసేవకులు జి.రక్షణానందం, జీజే జ్యోతి ఆనంద్, సీహెచ్ మోజస్, పాలా ఆశీర్వాదం తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

మద్యం షాపులకు 9లోపు దరఖాస్తు చేసుకోవాలి


మణికంఠరెడ్డి, తణుకు ఎక్సైజ్ సీఐ

తణుకు: తణుకు సర్కిల్ పరిధిలోని 33 మద్యం దుకాణాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు పట్టణం, రూరల్ పరిధిలోని 14, పెనుమంట్ర 6, పెనుగొండ 9, ఇరగవరం 4 చొప్పున మద్యం షాపులను కేటాయించినట్లు చెప్పారు. ఆయా దుకాణాలకు సంబంధించి ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన దరఖాస్తుదారుడు రూ. 2 లక్షలు డిమాండ్ డ్రాఫ్టుతో దరఖాస్తును తణుకులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయవచ్చని చెప్పారు. లాటరీలో ఎంపికైన వారు ఆయా మండలంలో ఏ గ్రామంలో అయినా మద్యం షాపును ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 9 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. 11న లాటరీ విధానంలో షాపులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. పూర్తి వివరాలకు 9440902436 నంబరులో సంప్రదించాలని సీఐ మణికంఠరెడ్డి కోరారు.

టీచర్లకు సత్కారం


ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పట్టణంలో గుంపుల సత్యకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీచర్స్‌ను ఘనంగా సత్కరించారు. పెంటపాడు ఎంఈఓలు శ్రీనివాస్, టీవీ రామకృష్ణలు హాజరయ్యారు. ప్రతిజ్ఞ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలన్నారు. జి.దుర్గా ప్రసాద్, చెల్లా దుర్గ, ఏపీటీఎఫ్ నాయకులు రమేష్‌లు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

భీమవరం: కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవడం దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భీమవరం శాఖ వరద బాధితుల సహాయార్థం రూ.2.68లక్షల సహాయాన్ని ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లు నడింపల్లి శంకర్ కుమార్ వర్మ, గొట్టుముక్కల బాలకృష్ణంరాజు, యువీ రామణరాజు, మేళం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్టు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నర్సయ్య అగ్రహారం పేకాటస్థావరంపై దాడిచేసి 12 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు ఆదివారం చెప్పారు. నర్సయ్య అగ్రహారంలోని ఇంటిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా డబ్బుతో కోతబండి పేకాడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10,430 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు చెప్పారు.

భీమవరంలో వైహెచ్‌ఏఐ కొరల్ జూబ్లీ వేడుకలు

భీమవరం: యూత్‌హాస్టల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైహెచ్‌ఏఐ) భీమవరం యూనిట్ కొరల్‌జూబ్లీ(35 ఏళ్ల) వేడుకలు డిసెంబర్ 14, 15 తేదిల్లో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం (త్యాగరాజు భవనం)లో నిర్వహించ డానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కన్వీనర్ గన్నాబత్తుల శ్రీనివాస్ చెప్పారు. ఉత్సవాల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించిన సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైహెచ్‌ఏఐ నేషనల్ చైర్మన్ మనోజ్ జోరి వేడుకలను ప్రారంభిస్తారని, కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రానికి చెందిన యువజన, టూరిజం శాఖల మంత్రులు పాల్గొంటారన్నారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పర్యావరణ–పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ, విజ్ఞాన యాత్రలు, ఎకో టూరిజం వంటి అంశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 99123 22269 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు డాక్టర్ సోమరాజు రూ. 20 వేలు అందించారు. సమావేశంలో మట్లపూడి సత్యనారాయణ, కట్రెడ్డి సత్యనారాయణ, బోనం పాండురంగరావు, తాళ్లపూడి గాంధీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కాళ్ల: సుమారు 17 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు జువ్వలపాలెం హైస్కూల్ వేదికైంది. 2007–08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోటకలిశారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, వరలక్ష్మి, పుష్పలత, సీతాదేవి, జ్యోతి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


కుంచనపల్లిలో మాట్లాడుతున్న ఓసూరి వీర్రాజు

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, వారి న్యాయమైన హక్కులు సాధనకు ఏఐటీయూసీ కృషి చేస్తోందని ఆ సంఘ ఏరియా అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు అన్నారు. ఆదివారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో ప్రాంతీయ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం తాడేపల్లి సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ విషయంలో ఏఐటీయూసీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఏరియా కార్యదర్శి మండలపర్తి హరీష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, అవిశెట్టి బాబూరావు, ఘంటా సింహాచలం, గంగాధర్, మూల స్వామి, బుల్లబ్బులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే హక్కుల సాధన


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో మాలలను దెబ్బకొట్టేలా వ్యవహరిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇప్పటికైనా మాలలు గ్రహించి హక్కులు సాధించుకునేందుకు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరులో జరిగే మాల సంఘాల జేఏసీ రాష్ట్ర సమావేశానికి మాలలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకుడు బోడదాసి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ అవుతారా.. సర్దుబాటు చేసుకుంటారా?

మద్యం దుకాణాలపై సస్పెన్స్


మద్యం బాటిళ్లు

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ మద్యం దుకాణాలు మూత పడ్డాయి. దసరా ఆఫర్‌గా ప్రైవేటు మద్యం దుకాణాలు ఈనెల 12వ తేదీ నుంచి ప్రజల ముంగిటకు రానున్నాయి. ఈ దుకాణాలకు దరఖాస్తులు ఎవ్వరు చేస్తున్నారు? లాటరీ ఎవ్వరికి తగులుతుంది? మద్యం వ్యాపారంలో ఉన్న వారికి కాకుండా ఇతరులకు దుకాణాలు వస్తే, సిండికేట్ అవ్వాలా, సర్దుబాటు చేసుకోవాలా ప్రస్తుతం ఇదే తరహా చర్చ సాగుతోంది. ఏరియాల వారీగా గత అమ్మకాల ఆధారంగా 12వ తేదీకి ముందే నిర్ణయాలు ఉండబోతున్నాయి.

100 దరఖాస్తులు

తాడేపల్లిగూడెం ఎక్సైజ్ పరిధిలో నియోజకవర్గంలోని గూడెం పట్టణం, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాలతోపాటు అత్తిలి, గణపవరం మండలాలు కూడా ఉన్నాయి. గూడెం పట్టణంలో నాలుగు బార్లు ఉన్నాయి. ఈ బార్ల లైసెన్సు కాలపరిమితి 2025 ఆగస్టు వరకు ఉంది. ఈ బార్‌ల వ్యాపారానికి ప్రైవేటు మద్యం దుకాణాలు వస్తే దుకాణాలు, బార్‌ల మధ్య వార్ జరిగే అవకాశాలున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణంలో 11, గూడెం మండలంలో ఆరు, పెంటపాడు మండలంలో ఎనిమిది, అత్తిలిలో ఏడు దుకాణాలు, గణపవరంలో నాలుగు మద్యం దుకాణాలు రానున్నాయి. గూడెం వ్యాపార కేంద్రం కావడంతో మద్యం అమ్మకాలు కూడా బాగానే ఉంటాయి. దీంతో లైసెన్సు కాలపరిమితి గల బార్‌ల నిర్వాహకులు మద్యం దుకాణాల కోసం సిండికేట్‌గా వంద దరఖాస్తులు సమర్పించనున్నట్టు తెలుస్తోంది. లాటరీ దుకాణం తగిలితే జాక్‌పాట్. కాదంటే దుకాణాలు తగిలిన వారితో బేరం కుదుర్చుకోవాలి. సర్దుబాటు చేసుకోవాలి. అనే భావన నెలకొంది.

దుకాణం ధర రూ.50 లక్షలు

కొత్త, పాత తరం వ్యాపారులు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి పోటీ పడుతున్నారు. ఏరియాలను బట్టి దుకాణాలు లాటరీలో దక్కించుకున్న వారికి రెండు సంవత్సరాల కాలం రూ.50 లక్షలు చెల్లించి వాటిని తీసుకొనే అవకాశాలున్నాయి. తెరవెనుక చక్రం ఎవ్వరు తిప్పుతారు. లాభాల్లో వాటాలు ఎలా నిర్ధారిస్తారు. సిండికేట్‌లో ఎవ్వరుంటారు. తెరపై ఎవ్వరు ఉంటారన్నది 11వ తేదీన తేలనుంది.

10 నుంచి యువజన సభలు

ఉండి: ఈ నెల 10 నుంచి 12 వరకు ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ యూత్ ఆధ్వర్యంలో 26వ యువజన శాంతి సహవాస కూడికలు నిర్వహిస్తున్నట్లు యూత్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సభలకు పాస్టర్ డి.మేషక్ సతీష్‌కుమార్, అడిషనల్ పాస్టర్ ఎస్ఏజే అబ్షాలోమ్‌రాజు సభాధ్యక్షులుగా స్థానిక సీఆర్ పి.కరుణాకర్ సభలను ప్రారంభిస్తారని తెలిపారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


దుంపగడపలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆకివీడు: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ సభ్యురాలు మోరా జ్యోతి రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడపలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు తమ అమూల్యమైన సమయాన్ని వైద్య శిబిరాలకు కేటాయిస్తున్నారని చెప్పారు. ఆసుపత్రులకు వెళ్లలేని రోగుల లోపాలను శిబిరాల్లో బయటపెట్టే అవకాశం ఉందన్నారు. కంటి పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించుకోవడం ద్వారా చత్వారం, శుక్లాలు, ఇతర కంటి రోగాల పట్ల అప్రమత్తంగా ఉండొచ్చని చెప్పారు. వైద్య శిబిరంలో సుమారు 152 మందికి పైగా వైద్య పరీక్షలను నిర్వహించారని వారిలో 24 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించినట్లు, 16 మందికి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని సూచించినట్లు చెప్పారన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పిన్నమరాజు మురళీకృష్ణంరాజు, దాట్ల రామరాజు, గోపాలరాజు, కెఎల్.నర్సింహరాజు, బలరామరాజు, వైద్యులు పి.కృష్ణ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భీమవరం: తాడేరులో అర్హత కలిగిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం ఎస్.అప్పలనాయుడు అధ్యక్షతన తాడేరు సీపీఎం శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ భీమవరం కు ఆనుకొని ఉన్న తాడేరు గ్రామంలో ప్రజలకుస్వచ్ఛమైన మంచినీళ్లు అందించడంలో పాలకవర్గాలు విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నూతన కమిటీను ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా గోందు జనార్దన్‌రావు, కమిటీ సభ్యులుగా శీలబోయిన భద్రం, ఎస్.అప్పలనాయుడు, జి.రాము, సింహాచలం, ఆల్తి అప్పలనాయుడు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు


గొడుగుల అలంకారంలో బలుసులమ్మ ఆలయం


విశ్వ దుర్గేశ్వరీ ఆలయంలో కూరగాయలతో విశేష అలంకరణ


శాకంబరిగా విశ్వదుర్గేశ్వరి


బలుసులమ్మ


వాసవి అమ్మవారు


సర్వమంగళమ్మ


శ్రీదేవి మహంకాళమ్మ


శాకంబరీదేవిగా విశ్వ దుర్గేశ్వరి


వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి


లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దువ్వ దానేశ్వరి


లలితా త్రిపుర సందరీ దేవీ అమ్మవారి అలంకరణలో మండపాక యల్లారమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నాలుగో రోజు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద అమ్మవారిని లలిత దేవిగా అలంకరించారు. నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షణలో లలిత సహస్ర నామం పూజలు, ఆలయాన్ని రక రకాల గొడుగులతోను, విద్యుత్ లైట్లతో విశేష అలంకరణ చేశారు. వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని కాశీ అన్నపూర్ణదేవిగా, శంకర మఠంలో సర్వమంగళమ్మవారిని కాశీ అన్నపూర్ణదేవిగా, శ్రీదేవి మహంకాళి అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో అమ్మవారిని లలిత త్రిపుర సుందరీ దేవిగా, వార్ఫ్‌రోడ్డులో ఉత్సవ పందిర వద్ద అమ్మవారిని రాజరాజేశ్వరీ అమ్మవారిగా, విశ్వదుర్గేశ్వరి సమేత అమ్మవారిని శాఖాంబరీదేవిగా విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

కూష్మాండాదేవిగా బాలాత్రిపుర సుందరి దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి పీఠంలోని అమ్మవారిని కూష్మాండాదేవిగా అలంకరించారు. అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, గోపీనాథ్, పారిశ్రామికవేత్త శ్యామ్ దంపతులు చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నవావరణ పూర్వక ప్రత్యేక అర్చనలు, లలితా సహస్ర నామ పారాయణలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి మాట్లాడుతూ శ్రీచక్ర రూపంలో ఉన్న ఆలయంలో స్వయంభువుగా వెలిసిన అమ్మవారి స్వరూపం కూష్మాండాదేవి అని, ఈ రూపంలో పూజించడం ద్వారా ఐశ్వర్యం, ఆరోగ్యం అన్ని రకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ఆకర్షణీయంగా ఆలయాలు

తాడేపల్లిగూడెం : పట్టణంలో దసరా నవరాత్రుల మంటపాలు నూతన శోభతో భక్తులను రారమ్మంటున్నాయి. అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, ఆలయ డెకరేషన్లతో ఉత్సవశోభను ద్విగుణీకృతం చేస్తున్నారు. నవదుర్గలుగా వివిధ రూపాల్లో జగజ్జనని భక్తులకు దర్శనమిస్తోంది. చల్లని దీవెనలు అందిస్తోంది. 17వ వార్డులోని విశ్వదుర్గేశ్వరి పేటలో విశ్వదుర్గేశ్వరిని శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. బలుసులమ్మ ఆలయం వద్ద చేసిన గొడుగుల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

లలితా త్రిపురసందరీదేవి ఆలంకరణలో దువ్వ దానేశ్వరి

తణుకు టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా నాలుగో రోజు మండలంలోని వివిధ దేవాలయాల్లో ఆదివారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవి అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. తణుకు మండలం దువ్వలోని దానేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం మండపాకలో యల్లారమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఆదివారం గాయత్రీ దేవీగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి రామకృష్ణ, ఈవో పి.సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. వేల్పూరులోని ఈశ్వరమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు నాలుగో రోజు అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. తణుకులోని కన్యకా పరమేశ్వరి ప్రార్థనా మందిరంలో నాలుగో రోజు గాయత్రీ దేవీ అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లలితా త్రిపురసుందరిగా దుర్గమ్మ

పెంటపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్తిపాడు వై. జంక్షన్ దుర్గమ్మ, ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని దుర్గమ్మ ఆలయాలలో లలితా త్రిపురసుందరీ దేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. బోడపాడు దుర్గమ్మ, రామలింగేశ్వరస్వామి, మౌంజీపాడు రోడ్డులో, పెంటపాడు, కె.పెంటపాడు, పలు గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవార్లు

అత్తిలి: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరవల్లిలో కనకదుర్గ అమ్మవారు ఆదివారం లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోగల అమ్మవార్ల ఆలయాలను భక్తులు, భవానీ భక్తులు దర్శించుకున్నారు.